కృష్ణుడి అల్లరి..

గోపికల సందడి

● ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ●



శ్రీ కృష్ణాష్టమి వేడుకలు సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వివిధ పాఠశాలల్లో చిన్నారులు చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో సందడి చేశారు. పలు ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉట్లను కొడుతూ చిన్నారులు ఆకట్టుకున్నారు.

కుత్బుల్లాపూర్



నందానగర్‌లోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..


సూరారం నార్త్ సిటీ హైస్కూల్లో..


ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లో ఉట్టి కొడుతున్న చిని కృష్ణుడు, గోపికలు


సుభాష్‌నగర్ బోధి వృక్షా ఒలింపియాడ్ స్కూల్‌లో..




చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారి


శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్


వేణువు ఊదుతున్న చిన్ని కృష్ణుడు


గోపికతో చిన్ని కృష్ణుడు

29న జోనల్ లెవెల్ క్రికెట్ సెలక్షన్స్

కుత్బుల్లాపూర్: ఈ నెల 29న 68వ ఎస్‌జీఎఫ్ కుత్బుల్లాపూర్ జోనల్ లెవెల్ క్రికెట్ సెలక్షన్స్‌ను నిర్వహిస్తున్నట్లు కుత్బుల్లాపూర్ జోనల్ సెక్రటరీ గోనె అరుణజ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురలకు పోటీలు ఉంటాయని, 14లో 2011 జనవరి 1వ తేదీ తర్వాత, 17లో 2008 జనవరి తర్వాత జన్మించి ఉండాలన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు బోనోఫైడ్, ఆధార్ కార్డులను సమర్పించాలని, విద్యార్థులు 29న ఉదయం 8గంటల వరకు పేట్‌బషీరాబాద్‌లోని డిస్ట్రిక్ట్ క్రికెట్ అకాడమీలో రిపోర్ట్ చేయాలన్నారు. వివరాలకు అరుణ జ్యోతి(9290496443) అనిరుద్(9000010069)లను సంప్రదించగలరు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు, బస్తీలకు చెందిన ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొవచ్చారు. దీనిపై స్పందించిన ఆయన పలు శాఖల అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా పలువురు శుభకార్యాలయ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



దుండిగల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్‌కు వెళ్లే దారిలో మసీదు వద్ద ఓ వ్యక్తి చనిపోయి ఉండడాన్ని స్థానికులు గమనించారు. వెంటనే దుండిగల్ పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. మృతుడి వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, భిక్షాటన చేస్తుంటాడని, అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తేవాలి


ధన్‌రాజ్ యాదవ్‌ను కలిసిన స్విమ్మర్ సిద్ధార్థ్ కలియా

నిజాంపేట్: స్విమ్మింగ్ పోటీల్లో రాణించి తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తేవాలని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ ధర్మారెడ్డి కాలనీకి చెందిన సిద్ధార్థ్ కలియా దాయిలాండ్ షిప్‌పకాట్‌లో ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ అండర్–14 విభాగానికి ఎంపికయ్యాడు. సోమవారం సిద్ధార్థ్ నిజాంపేట్‌లో ధన్‌రాజ్‌యాదవ్‌ను మార్యదపూర్వకంగా కలిశాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆయన కోరారు. తెలంగాణ దినేష్ రాజోరియా స్విమ్మింగ్ జనరల్ సెక్రటరీ, ట్రైనర్ విజయ్ సింగ్ ఉన్నారు.

నేడు బాచుపల్లిలో వాలీబాల్ టోర్నమెంట్

నిజాంపేట్: బాలానగర్ డీసీపీ జోనల్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు, పురుషులకు విడివిడిగా జరిగే పోటీల్లో మొత్తం 40 జట్లు పోటీ పడనున్నాయని, ఉదయం 9 గంటలకు టోర్నమెంట్‌ను డీసీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి


మదర్ థెరిస్సా జయంతి వేడుకల్లో కొలన్ హన్మంతరెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: మదర్ థెరిస్సా సేవలు మరువలేనివని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వరి టెంపుల్ సౌజన్యంతో మదర్ థెరిస్సా సేవా కమిటీ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. అంతకు ముందు కొలన్ హన్మంతరెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, మదర్ థెరిస్సా సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని సోమవారం మల్లారెడ్డి ఆస్పత్రి సౌజన్యంతో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ జగన్ ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన క్యాంప్‌లో డయాబెటీస్, బీపీ, కీళ్ల నొప్పులు, దంత, నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో సొసైటీ సభ్యులు దేవి, ఝాన్సీ, సుభాష్, అరుణ్, సాత్విక, విఠల్‌రాజ్, సహస్ర, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్పొరేటర్ సబిహా బేగం


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: కాలనీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ ఆర్‌కే సొసైటీ ఇండోర్ స్టేడియం ఆవరణలో సోమవారం ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమాజ హితం కోసం చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. వైద్యుల సూచనల మేరకు ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సుభాన్, చాంద్ పాషా, రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, విజయకుమార్ గౌడ్, యోగిరాజ్ పాల్గొన్నారు.

నేడు భవిష్య నిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లో రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో, మేడ్చల్ ఇండస్ట్రియల్ ఏరియాలోని రానే ఇంజిన్ వాల్వ్ కంపెనీలో, మాదాపూర్‌లోని కాపస్టన్ సర్వీస్ లిమిటెడ్ కంపెనీలో అదాలత్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక వారియ సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు.

మహిళా భవన్ నిర్మాణ పనులకు భూమి పూజ

సుభాష్‌నగర్: మహిళల ఆర్థిక స్వావలంబన సాధించేందుకు మహిళా భవన్‌లు దోహద పడతాయని సూరారం కార్పొరేటర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం న్యూ శివాలయనగర్‌లో నూతనంగా నిర్మించబోయే మహిళా భవన్ నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక మహిళల సమావేశాలకు, కుట్టు శిక్షణ ఇతర కార్యక్రమాలకు చేపట్టేందుకు మహిళ భవన్ ఉపయోగపడుతుందన్నారు. మహేశ్వర్ రెడ్డి, నరసింహారెడ్డి, చిట్టి షైనాజ్, కవిత తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ తదితరులు

ఉల్లాసంగా నగర నాట్య సంకీర్తన


నగర నాట్య సంకీర్తన నిర్వహిస్తున్న నృత్య కళాకారులు

నిజాంపేట్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని పద్మశ్రీ డాక్టర్ జి.పద్మజారెడ్డి బృందం నగర నాట్య సంకీర్తన నిర్వహించారు. ప్రణవ్ కూచిపూడి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో సోమవారం నిజాంపేట్ కూడలిలో ఉన్న నాట్య సంస్థ నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమైన నగర నాట్య సంకీర్తన వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు కనుల పండువగా కొనసాగింది. వంద మందికి పైగా నాట్య కళాకారులు, నృత్య గురువులు, తలిదండ్రులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొన్నారు. కీర్తనలు ఆలపిస్తూ భజన గానం చేస్తూ, కోలాటం ఆడుతూ, కూచిపూడి నృత్యాలు చేస్తూ ఈ నాట్య సంకీర్తన ఉల్లాసంగా కొనసాగింది. ఈ సందర్భంగా పద్మజా రెడ్డి మాట్లాడుతూ.. కూచిపూడి నాట్యం భక్తి సంగీతం సమన్వయంతో జరిగిన నాట్య సంకీర్తనకు అపూర్వ స్పందన లభించడం సంతోషం ఉందన్నారు. శ్రీకృష్ణాష్టమి పండుగ విశిష్టతతో పాటు సాంస్కృతిక కళా వారసత్వ ఘనతను ఈ కార్యక్రమం చాటి చెప్పిందన్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో హారతితో నాట్య సంకీర్తన ముగిసింది. పురవీధుల్లో జనం నాట్య సంకీర్తను ఆసక్తిగా తిలకించి జై శ్రీకృష్ణ నినాదాలతో ఘన స్వాగతం పలికారు.

ఇబ్బందులు లేకుండా గణేష్ నిమజ్జన ఏర్పాట్లు చేయాలి


సూరారం లింగ చెరువు వద్ద ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: ఎలాంటి ఇబ్బందులు లేకుండా గణేష్ నిమజ్జన ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సూరారం లింగ చెరువును సోమవారం మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, బాలనగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సూరారం ఇన్‌స్పెక్టర్ భరత్ కుమార్, జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లతో కలిసి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. గండి మైసమ్మ నుంచి వచ్చే వారికి..సూరారం నుంచి వచ్చే వాహనాలుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ క్రేన్లతో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకునే విధానంపై అడిగి తెలుసుకున్నారు. రూట్ మ్యాప్ సిద్ధం చేసి ఉంచాలని ఏదైనా చిన్న సంఘటన జరిగినా సమాచారం తెలిసిన వెంటనే ఘటన స్థలానికి వెళ్లేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



కుత్బుల్లాపూర్: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి తప్పిపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లి పోచమ్మగడ్డకు చెందిన కె.లింగం(35) ఈ నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా జాడ తెలియరాలేదు. లింగం మానసిక స్థితి సరిగా లేదని అతని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెహ్రూ నగర్ హైస్కూల్‌లో చోరీ

చింతల్: చింతల్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. పాఠశాల కార్యాలయంతో పాటు తరగతి గదుల్లో విలువైన విద్యుత్ వైర్లను తస్కరించారు. ఈ పాఠశాలలో సుమారు 15 రోజుల పరిధిలోని రెండవసారి దొంగలు పడడం పాఠశాల సిబ్బందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. పాఠశాల చుట్టూ నివాస గృహాలు ఉన్న పాఠశాలలో దొంగతనం జరగడం గమనార్హం. కాగా పాఠశాల హెచ్‌ఎం జెమినీ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ తమ సిబ్బందితో వచ్చి పాఠశాలలను దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు.

అధికారులు సమస్యను గుర్తించేదెప్పుడో?

● లీకేజీలతో వృథాగా పోతున్న తాగునీరు ● సమస్యను గుర్తించకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు


వృథాగా పోతున్న గోదావరి జలాలు

చింతల్: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న చిన్నగా తయారైంది జలమండలి అధికారులు పనితీరు. సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డు, ఎంఎస్‌నగర్‌లో తలెత్తిన నీటి పైప్‌లైన్ కలుషిత జలాల సరఫరాపై గత నెల రోజులుగా జలమండల అధికారులు కుస్తీ పడుతునా సమస్య మాత్రం దొరకడం లేదు. లీకేజీల మరమ్మతులకు పనులు చేపట్టే కాంట్రాక్టర్ ఇద్దరు చొప్పున లేబర్‌ను పంపించి సమస్యను పరిష్కరించేందుకు అక్కడక్కడ తవ్వకాలు చేపట్టిన సమస్యను మాత్రం కనుగొనలేకపోతున్నారు.దీంతో ఎంతో విలువైన తాగునీరు నేలపాలవుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నెలరోజులుగా తవ్వకాలు..

ఎం.ఎస్‌రెడ్డినగర్‌లో నెల రోజుల క్రితం గోదావరి జలాలు మురుగునీటితో కలిసి సరఫరా అవుతున్నాయని స్థానికులు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు మరమ్మతుల నిమిత్తం ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏ కాలనీలో కలుషిత జలాల సరఫరాపై కాంట్రాక్టర్ కు సంబంధించిన వ్యక్తులు తాగునీటి పైపులైన్‌కు అక్కడక్కడ తవ్వకాలు చేపట్టినా లీకేజీ ఎక్కడ జరుగుతుందో నేటికీ కనుగొనలేకపోయారు. దీంతో గల్లీలలో తవ్వకాలు చేపట్టిన గోతులే దర్శనమిస్తున్నాయి.


సుభాష్‌నగర్‌లో మురుగునీటిలో కలుస్తున్న తాగునీరు

రోగాలబారిన వృద్ధులు, చిన్నారులు..

ఎం.ఎస్.రెడ్డి నగర్‌లో తాగునీరు, భూగర్భ డ్రైనేజీ నీరు కలిసి నల్లాల ద్వారా సరఫరా అవుతుండడంతో వృద్ధులు, చిన్నారులు ఇప్పటికే అనేక మంది రోగాలబారిన పడ్డామని వాపోతున్నారు. అంతేకాకుండా మరమ్మతులు చేపట్టే సమయంలో లైన్‌మెన్లు, మరమ్మతులు చేపట్టే సిబ్బందికి సమన్వయ లోపంతో మరమ్మతుల సమయం లోనూ నీటి సరఫరాను కొనసాగిస్తున్నారని, దీంతో వందలాది కిలోమీటర్ల నుంచి వచ్చిన తాగునీటి గోదావరి జలాలు వృథాగా నాల్లాల్లో కలిసి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక యుగంలోనూ లీకేజీ పాయింట్ ఎక్కడ ఉందో కనుగొనలేకపోవడం హాస్యాస్పదంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.